రీ అడ్మిషన్లతో విద్యార్థులకు భరోసా

- గతేడాది పది, ఇంటర్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- పాఠశాల, కాలేజీల్లో రీ అడ్మిషన్లు ఇచ్చి శిక్షణ
- ఈసారి ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చొరవపై తల్లిదండ్రుల హర్షం


రొద్దం మండలం తురకలాపట్నం ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో రీజాయిన్ అవుతున్న విద్యార్థులు (ఫైల్)

హిందూపురంటౌన్/పెనుకొండ/మడకశిరరూరల్: చదువులో కాస్త వెనుకబడి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల జీవితాలను సరిదిద్దేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే గత ఏడాది పది, ఇంటర్ మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించింది. వారిని మళ్లీ పాఠశాల, కాలేజీల్లో చేర్పించి వారి భవిష్యత్‌కు భరోసా ఇస్తోంది. రీ అడ్మిషన్ అయిన విద్యార్థులు పబ్లిక్‌లో ఉత్తీర్ణత సాధిస్తే రెగ్యులర్ విద్యార్థులుగానే పరిగణిస్తుండటంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'పురం' నియోజకవర్గంలో 200 మంది

2022–23 విద్యా సంవత్సరంలో ఇంటర్ మీడియట్, 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోంది. పరీక్షల్లో ఫెయిన్ అయిన విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి ప్రస్తుతం జరిగే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా తీర్చి దిద్దుతున్నారు. ఈ నేపథ్యంలో గత సంవత్సరం పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను తిరిగి కళాశాల, పాఠశాలల్లో ఇప్పటికే రీ అడ్మిషన్ చేసుకొని వారిని పబ్లిక్ పరీక్షల కోసం తీర్చిదిద్దుతున్నారు. హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 200 మంది ప్రభుత్వ విద్యార్థులు పాఠశాలలో రీ అడ్మిషన్లు పొంది పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ కళాశాలల పరిధిలో దాదాపు 20 మంది విద్యార్థులు పరీక్షలు సిద్ధమవుతున్నారు.

పెనుకొండలో 123 మంది ఇంటర్ విద్యార్థులు..

పెనుకొండ నియోజకవర్గంలో గత సంవత్సరం జరిగిన ఇంటర్ మీడియట్, పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆయా పాఠశాల, కాలేజీల్లో రీ జాయిన్ అయ్యారు. పెనుకొండ కళాశాలలో ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్‌కు కలిపి 123 మంది విద్యార్థులు రెగ్యులర్ విద్యార్థులుగా ఈసారి పరీక్షలకు హాజరవుతున్నారు. అలాగే పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన 936 మంది విద్యార్థులు కూడా రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా పరీక్షలు రాయనున్నారు.

మడకశిరలో 41 మంది రీజాయిన్

మడకశిర నియోజకవర్గంలో పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయి తిరిగి 41 మంది విద్యార్థులు ఆయా మండలాల్లో ఉన్న ప్రభుత్వ బడుల్లో రీ అడ్మిషన్ పొందారు. అలాగే ఇంటర్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులు కూడా కాలేజీలో చేరారు. దీంతో ఆయా పాఠశాల, కాలేజీల అధ్యాపకులు వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. వారు చదువులో ఎక్కడ వెనుకబడ్డారో గుర్తించి వాటిని అధిగమించేలా చేస్తున్నారు.


బుళ్లసముద్రం ఉన్నత పాఠశాలలో రీ అడ్మిషన్ అయిన విద్యార్థి నవీన్ రెగ్యులర్ విద్యార్థుల మధ్య కూర్చుని పాఠాలు వింటున్న దృశ్యం

విద్యార్థులకు వరం



నేను ఇంటర్ మొదటి సంవత్సరంలో 2 సబ్జెక్టులు, సెకండ్ ఇయర్‌లో 1 సబ్జెక్టు ఫెయిలయ్యాను. మళ్లీ కాలేజీలో రీ జాయిన్ అయి చదువుకోవచ్చని అధ్యాపకులు చెప్పడంతో కాలేజీలో చేరాను. ఈసారి రెగ్యులర్‌గా పరీక్ష రాస్తున్నా. అధ్యాపకులు కూడా ప్రత్యేక శ్రద్ధతో చదువు చెబుతున్నారు. ఈసారి కచ్చితంగా పరీక్షల్లో పాసవుతా. విద్యార్థులకు రీజాయిన్ అవకాశమిచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– విజయకుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెనుకొండ

ఈసారి ఉత్తీర్ణత సాధిస్తా...



నేను గత ఏడాది చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివాను. అయితే పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాను. జూలైలో మా అమ్మనాన్నలకు ప్రధానోపాధ్యాయురాలి నుంచి సమాచారం వచ్చింది. మీ అమ్మాయిని పాఠశాలలో రీ అడ్మిషన్ చేసుకుంటామని చెప్పారు. తప్పిన సబ్జెక్ట్‌లో పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధిస్తే రెగ్యులర్ విద్యార్థులతో పాటు సర్టిఫికెట్ జారీ చేస్తామని చెప్పారు. దీంతో పాఠశాలలో అడ్మిషన్ పొందాను. పాఠశాలకు రెగ్యులర్‌గా వెళుతున్నాను. ఈసారి కచ్చితంగా ఉత్తీర్ణత సాధిస్తా.

–నందిని, విద్యార్థిని, నాయనిపల్లి, లేపాక్షి మండలం

ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నాం



గత సంవత్సరంలో ఇంటర్ మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థినులకు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా సూచనలు ఇస్తూ ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నాం. హిందూపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గత సంవత్సరంలో 19 మంది ఫెయిల్ అయ్యారు. ఏడు మంది విద్యార్థినులకు తిరిగి రీ అడ్మిషన్లు కల్పించి ప్రత్యేకంగా సూచనలు, సలహాలు ఇస్తున్నాం. ఈ విద్యా సంవత్సర పరీక్షల్లో వారు ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ ఇస్తున్నాం. – మురళీమోహన్,ప్రిన్సిపాల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, హిందూపురం

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తా



గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో లెక్కల్లో ఫెయిల్ అయ్యాను. మళ్లీ ఎలా ప్రిపేర్ కావాలో అర్థం కాలేదు. ఆ సమయంలోనే ప్రభుత్వం రీజాయిన్ అవకాశాన్ని కల్పించడంతో పాఠశాలలో చేరాను. రోజూ రెగ్యులర్ విద్యార్థులతో కలసి చదువుకుంటున్నాను. ఈ సారి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తాను.

– రాహుల్, గౌడనహళ్లి, మడకశిర మండలం

అన్ని సౌకర్యాలూ కల్పించారు



పదో తరగతిలో ఫెయిల్ అయ్యాను. మరోసారి స్కూల్‌లో రీ అడ్మిషన్ అయి ఈసారి ఎలాగైనా పాస్ కావాలన్న పట్టుదలతో చదువుకుంటున్నాను. ప్రభుత్వం మాలాంటి విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేలా తొలిసారి తీసుకున్న రీ అడ్మిషన్ నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషాన్నిచ్చింది. పాఠశాలలో రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా అన్ని సౌకర్యాలు కల్పించి ఉపాధ్యాయులు చదువును ప్రోత్సహిస్తున్నారు.

– పీ నవీన్, బుళ్లసముద్రం, మడకశిర మండలం

రెగ్యులర్ వారితో సమానంగా..



10వ తరగతిలో నేను లెక్కలు, తెలుగులో ఫెయిలయ్యాను. అయితే ప్రభుత్వం ఫెయిల్ అయిన విద్యార్థులను రెగ్యులర్‌గా పరిగణిస్తూ పరీక్షలు రాయిస్తుండడం చూస్తే విద్యకు ఏ ఒక్క విద్యార్థి దూరం కాకూడదన్న లక్ష్యం అర్థమవుతోంది. ఈసారి పబ్లిక్ పరీక్షల్లో కచ్చితంగా ఉత్తీర్ణత సాధించేలా చదువుతున్నాను.

– జి. నందకృష్ణ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెనుకొండ

క్లుప్తంగా

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట


నూతన విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని భీమరాయనపల్లిలో ప్రతిష్టాపనకు నూతనంగా తయారు చేయించిన ఉజ్జినప్ప ,రామప్ప విగ్రహాలకు ఆదివారం జ్యోతుల ఉత్సవాలు నిర్వహించారు. కలశ, గంగపూజ నిర్వహించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించారు.

హనుమద్వాహనంపై వేంకటరమణుడు


హనమద్వాహనంపై ఊరేగుతున్న పేట వెంకటరమణస్వామి..

హిందూపురం: పట్టణంలోని మెయిన్ బజారులోని పేట వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హనుమంత వాహనంపై పట్టణ వీధుల్లో ఊరేగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలమత్తూరు: మండలంలోని 44వ నెంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్ సమీపంలో గల పంజాబీ డాబా వద్ద మినీ బస్సు ఢీకొని మొరంపల్లికి చెందిన రామచంద్రారెడ్డి (50) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు... ఆదివారం రాత్రి 7.30 ప్రాంతంలో డాబా వద్ద నుంచి సర్వీసు రోడ్డులో రామచంద్రారెడ్డి, రామారావు కొడికొండ చెక్‌పోస్ట్ వైపునకు వస్తుండగా ఎదురుగా వచ్చిన మినీ బస్సు ఢీకొంది. రామచంద్రారెడ్డి మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన రామారావును హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మినీ బస్సు డ్రైవర్ స్థానిక పీఎస్‌లో లొంగిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు.

అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ: స్థానిక తుమకూరు రోడ్డులో నూతన మిని విధాన సౌధ భవనాన్ని నిర్మిస్తామని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ తెలిపారు. పట్టణ సమీపంలో శిరా రోడ్డు కురుబర హళ్లి గేట్ వద్ద ఉన్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రూ 3.5 కోట్ల నిధులతో అదనపు గదుల నిర్మాణానికి ఆదివారం ఆయన భూమి పూజ చేశారు.

అ'పూర్వ' సమ్మేళనం


కొడికొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

చిలమత్తూరు: మండలంలోని కొడికొండలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92 విద్యా సంవత్సరంతో పదో తరగతి చదువుకున్న వారంతా ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్నారు. 32 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, జమాల్‌సాబ్‌లను సత్కరించారు.

నేడు వలంటీర్లకు వందనం

పెనుకొండ: పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు నియోజకవర్గ స్థాయి వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంత్రి ఉషశ్రీచరణ్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. వార్డు వలంటీర్లు తప్పక హాజరు కావాలని సూచించారు.

అగళి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో సోమవారం మధ్యాహ్నం వలంటీర్లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మడకశిరరూరల్: పట్టణంలోని మహాత్మా జ్యోతిభాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల (ఎంజేపీ) జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మురళీధర్ రావు తెలిపారు. అర్హులైన బాలురు మార్చి 1వ తేదీ నుంచి 31 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు.


పెనుకొండ: మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో బయలుదేరుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


మడకశిర: ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

రాప్తాడుకు తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు


పెనుకొండ: సిద్ధం సభకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


లేపాక్షి: సిద్ధం సభకు బయలు దేరుతున్న నాయకులు, కార్యకర్తలు


రొద్దంలో నుంచి సిద్ధం సభకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు


అమరాపురం మండలం ఆలదపల్లి నుంచి...

సాక్షిబృందం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వందల సంఖ్యలో బస్సులు, ప్రైవేటు వాహనాల్లో ఉదయమే బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జై జగన్ నినాదాలతో హోరెత్తించారు.


మడకశిర మండలం కల్లుమర్రి నుంచి బయలుదేరి వెళ్తున్న నాయకులు


గుడిబండ: సిద్ధం సభకు తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు


హిందూపురం మండలం మణేసముద్రం నుంచి బయలు దేరుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


మడకశిర మండలం గౌడనహళ్లి నుంచి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు


మడకశిర మండలం చందకచెర్ల నుంచి ....


హిందూపురం నుంచి బస్సులు, కార్లలో వెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


గోరంట్ల నుంచి సిద్ధం సభకు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చరిత్ర సృష్టించిన 'సిద్ధం సభ'

మడకశిర: రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభ టీడీపీలో వణుకు పుట్టించిందని ఎమ్మెల్యే తిప్పేస్వామి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప తెలిపారు. ఈ మేరకు వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఇంత పెద్ద సభ రాయలసీమ చరిత్రలో ఎప్పుడూ జరగలేదన్నారు. ఈ సభ ఒక చరిత్ర సృష్టించిందని తెలిపారు. ఈసభతో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయం మరోసారి ఖరారైనట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ సభకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లి విజయవంతం చేయడం హర్షణీయమన్నారు. సిద్ధం సభతో టీడీపీ శ్రేణుల వెన్నుల్లో వణుకు పుట్టింటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్నారు.

మృతుడి ఆచూకీ గుర్తింపు

సోమందేపల్లి: మండల పరిధిలోని చాకర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఈనెల 16వ తేదీ అర్ధ రాత్రి రైలు కింద పడి మృతి చెందిన యువకుడిని వెంకటేష్ (16)గా గుర్తించారు. మృతుడు వెంకటేష్ సోమందేపల్లికి చెందిన జగన్ అనే వ్యక్తి కుమారుడని రైల్వే పోలీసులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నట్లు హెచ్‌ఎం ఖాదర్‌వలీ తెలిపారు. అయితే ప్రేమ వ్యవహారమే వెంకటేష్ మృతికి కారణమని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఎవరైనా చంపి రైలు కింద పడేశాడా? అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

బాధితులకు చేయూత


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జపానంద

పావగడ: తాలూకాలోని పొన్న సముద్రంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో గుడిసె కాలిబూడిదైన సంగతి తెలిసిందే. బాధితులు గ్యాదరప్ప, హనుమక్క దంపతులను స్థానిక రామకృష్ణ సేవాశ్రమాధిపతి స్వామి జపానంద ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, నూతన వస్త్రాలు అందించారు.

సిద్ధేశ్వరస్వామికి పూజలు

రొళ్ల: మండల పరిధిలోని టీడీపల్లి గ్రామ సమీపంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి అర్చకులు వివిధ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామి వారికి సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని భక్తులు తెచ్చిన వివిధ పూలతో అలంకరించి మహా మంగళ హరతి ఇచ్చారు. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాద వినియోగం చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో పాటు మాఘమాసం కావడంతో మడకశిర నియోజకవర్గం నుంచే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించారు.


కనుల పండువగా సాగుతున్న కోడిరంగనాథస్వామి బ్రహ్మ రథోత్సవం

వైభవంగా బ్రహ్మరథోత్సవం

లేపాక్షి: మండలంలోని శిరివరం గ్రామంలో వెలసిన కోడిరంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం వైభవంగా సాగింది. రథంపై స్వామి వారు అశేష జన సందోహం మధ్య పురవీధుల గుండా ఊరేగారు. మొదట కోడిరంగనాథస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథం ముందు శాస్త్రోక్తంగా హోమాలు, పూజలు చేశారు. అనంతరం దేవాలయం నుంచి అశ్వత్థ కట్ట వరకు రథంపై స్వామివారిని ఊరేగించారు.

రోతరాతలు మానుకోండి


ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

హిందూపురం: 'దేశ చరిత్రలో ఇంత వరకూ కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమాభివృద్ధి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగనే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని జీర్ణించుకోలేక ఈనాడు, ఆంధ్రజ్యోతి మరిన్ని పేపర్లు, ఛానళ్లు రోజూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బురద జల్లుతున్నాయి' అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి విమర్శించారు. రాప్తాడు సిద్ధం సభకు స్వచ్ఛందంగా తరలుతుంటే లేనిపోని ఫొటోలు, వీడియోలు చూపిస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రాలను తగులబెట్టి నిరసన తెలిపారు.